సాక్షి చిత్తూరు

గురువారం । 13 । జూన్ । 2024



పంటపొలాలపై ఏనుగుల దాడి

కల్లూరు మండలంలో పంట పొలాలపై ఏనుగులు దాడి చేసి రైతులకు తీరని నష్టం చేకూర్చాయి. - 8లో



అతిసారం.. వద్దు నిర్లక్ష్యం

వర్షాకాలం కావడంతో జిల్లావ్యాప్తంగా అతిసారం ప్రబలుతోందని, ప్రజలతంతా శుభ్రత పాటించాలని వైద్యసిబ్బంది సూచిస్తున్నారు. - 8లో

మొగిలిఘాట్‌లో కారు బోల్తా ..



మొగిలి ఘాట్ సమీపంలో ఓ కారు అదుపు తప్పి బోల్తా పడడంతో నాలుగు నెలల గర్భిణి మృతి చెందగా, భర్త, తల్లి గాయపడిన సంఘటన వెలుగు చూసింది. - 8లో

న్యూస్‌రీల్

ఎన్నికల్లో గెలుపోటములు సహజం

– మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాట్లాడుతున్న నారాయణస్వామి

పాలసముద్రం : రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమికి కారణాలను సమీక్షించుకుని ముందుకు సాగుతామని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పదవులు శాశ్వతం కాదని, జీవితంలో కష్టాలు, సుఖాలు ఉన్నట్టే ఎన్నికల్లోనూ గెలుపోటములు ఉంటాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి మేలు చేసిందని, కానీ ఎక్కడ లోపం జరిగిందో అంతు చిక్కడం లేదన్నారు. ముఖ్యంగా పేదలు, మహిళలు, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు లబ్ధి చేకూర్చేలా అనేక పథకాలు అమలు చేశామన్నారు. ఎన్నికలు అయిన తరువాత విగ్రహాలను కూల్చడం, గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం ఇంత వరకూ ఎన్నడూ లేదని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజల తరఫున కూటమి ప్రభుత్వంపై పోరాడతామని ఆయన తెలిపారు.

ఆగని సేవా దాతృత్వం



పౌష్టికాహారం అందిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

నగరి : ప్రభుత్వ ఆస్పత్రికి విచ్చేసే గర్భిణులు ఆహారం కోసం ఎలాంటి ఇబ్బంది పడకూడదని మాజీ మంత్రి ఆర్కేరోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రారంభించిన పౌష్టికాహార పంపిణీ నిరంతరాయంగా కొనసాగుతోంది. రాజకీయ పరిణామాలు ఎలా మారినా తన సేవలో మార్పు ఉండదన్న రీతిలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. తాజాగా బుధవారం నగరి, పుత్తూరు ప్రభుత్వాస్పత్రులకు చికిత్స నిమిత్తం విచ్చేసిన గర్భిణులకు, వారి వెంట వచ్చే సహాయకులకు కూడా ఉచితంగా వెజిటబుల్ రైస్, గుడ్డు, పుదీన చట్నీ, చిక్కీ, అరటిపండు, రైతాతో కూడిన పౌష్టికాహారం అందించారు. మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి, వైద్యులు కార్తిక్ గర్భిణులకు భోజనం వడ్డించారు.

సలహాదారు పదవికి రాజీనామా



ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ వాసుదేవరెడ్డి

బంగారుపాళెం: రాష్ట్ర ప్రభుత్వ వైద్య సలహాదారు పదవికి రాజీనామా చేసినట్లు ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ నలిపిరెడ్డి వాసుదేవరెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని పెరుమాళ్లపల్లెకు చెందిన డాక్టర్ వాసుదేవరెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైద్య సలహాదారుగా ఉన్నారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని ప్రభుత్వానికి పంపినట్లు చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందడంతో పదవికి రాజీనామా చేసినట్లు ఆయన ప్రకటించారు.

ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు



జంగిల్ సఫారీ రోడ్డును పరిశీలిస్తున్న సీసీఎఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్‌ఓ చైతన్యకుమార్ రెడ్డి

రామకుప్పం: మండలంలోని ననియాల ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలని అనంతపురం సీసీఎఫ్ నాగేశ్వరరావు అటవీ అధికారులకు సూచనలు చేశారు. బుధవారం చిత్తూరు డీఎఫ్‌ఓ చైతన్యకుమార్ రెడ్డితో కలసి ఆయన ననియాలలో ఏనుగు కదలికలను పరిశీలించిన అనంతరం ఎకో టూరిజంలోని జంగిల్ సఫారీ రోడ్డును పరిశీలించారు. పార్కు అభివృద్ధికి తీసుకోవాల్సిన సూచనలను స్థానిక అటవీ అధికారులు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. అనంతరం కుప్పం మండలం బేటరాయస్వామి కొండ ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట కుప్పం రేంజి అధికారి జయశంకర్, రామకుప్పం డీవైఆర్‌ఓ వై.సి.రెడ్డి, ననియాల ఎఫ్ఎస్‌ఓ బాబు ప్రసాద్ ఉన్నారు.

బాబు కేబినెట్‌లో జిల్లాకు నో చాన్స్

- మంత్రి పదవి దక్కకపోవడంతో సీనియర్ల నిరాశ
- నీరుగారిన ఎమ్మెల్యేల ఉత్సాహం
- డీలా పడిన కూటమి శ్రేణులు



సాక్షి, తిరుపతి/చిత్తూరు: కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు రెండు, మూడు మంత్రి పదవులు వస్తాయని ఆశించిన ఎమ్మెల్యేల ఆశలు నీరుగారిపోయాయి. 13 మంది ఎమ్మెల్యేల్లో ఒక్కరికి కూడా మంత్రి పదవి దక్కలేదు. చిత్తూరు జిల్లా కుప్పం నుంచి ప్రాతినిధ్యం వహించిన చంద్రబాబు నాయుడు బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. చంద్రబాబుతో పాటు మరో 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో జిల్లా నుంచి ఇద్దరో ముగ్గురో ఎమ్మెల్యేలకు కేబినెట్‌లో చోటు దక్కుతుందని కూటమి నేతలు ధీమాగా ఉన్నారు. చంద్రబాబు సొంత జిల్లా కావడంతో పదవులకు ఢోకా లేదని భావించారు. ఈ క్రమంలోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఏకంగా ముగ్గురికి మంత్రి పదవులు దక్కాయి. ఈ మేరకు కూటమి ప్రభుత్వంలో కూడా ఆ స్థాయిలో మంత్రి పదవులు ఉంటాయనుకున్నారు. అయితే చంద్రబాబు తప్ప మరొకరికి మంత్రి వర్గంలో చోటు కల్పించకపోవడంతో కూటమి శ్రేణులు డీలా పడ్డారు.

మిగిలింది నామినేటెడ్ పదవులే..

మంత్రి వర్గంలో చోటు దక్కని వారికి మిగిలిన ప్రభుత్వ పదవులైనా దక్కుతాయా? లేదా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇస్తే గిస్తే.. చీఫ్ విప్, విప్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇవి కాకుండా.. నామినేటెడ్ పదవులు ఉన్నాయి. అయితే నామినేటెడ్ పోస్టులపై అనేక మంది నాయకులు ఆశలు పెట్టుకున్నారు. వాటిని ఎమ్మెల్యేలకు ఇస్తే.. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన తమకేం ఇస్తారని కూటమి నేతలు దిగాలు పడుతున్నారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తున్న సీఎం చంద్రబాబును స్వయంగా కలసి విన్నవించి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ఎమ్మెల్యేలతో పాటు సీనియర్ నాయకులు ప్రయత్నాలు చేయనున్నట్లు సమాచారం.

అమర్‌కి ఖాయం అనుకుంటే..

ఉమ్మడి జిల్లాలోని టీడీపీ నేతల్లో సీనియర్ అయిన పలమనేరు ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డికి ఈ పర్యాయం మంత్రి పదవి ఖాయమని అనుకున్నారు. ఊహించని విధంగా అమర్‌నాథ్‌రెడ్డికి కేబినెట్‌లో చోటు దక్కలేదు. అలాగే తిరుపతి జిల్లాలోని సీనియర్ అయిన వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు సైతం మొండిచేయే మిగలడం గమనార్హం. ఇక సామాజిక వర్గాల వారీగా చూస్తే గూడూరు, సత్యవేడు, తిరుపతి ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, ఆదిమూలం, ఆరణి శ్రీనివాసులు ముగ్గురిలో ఒక్కరినైనా మంత్రి పదవి వరిస్తుందని కూటమి నేతలు భావించారు. జనసేన కోటాలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ఖాయమని అనుకున్నారు. ఆయనకు సైతం అమాత్య పదవి దక్కలేదు.

ముఖ్యమంత్రికి సాదర స్వాగతం



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాలవలవన్

రేణిగుంట : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మొట్టమొదటిగా జిల్లా పర్యటనకు విచ్చేశారు. రాత్రి 7.35గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ముఖ్యమంత్రి వెంట మంత్రి నారా లోకేష్ ఉన్నారు. దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వలవన్, డీఐజీ షిముషి బాజ్‌పాయ్, తిరుపతి, చిత్తూరు కలెక్టర్లు ప్రవీణ్‌కుమార్, షణ్మోహన్, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు, కూటమి నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక ప్రవేశ ద్వారం నుంచి విమానాశ్రయం వెలుపలకు వచ్చిన చంద్రబాబు వీవీపీ గ్యాలరీలో కొద్దిసేపు టీడీపీ శ్రేణులతో మాట్లాడారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

పటిష్ట ఏర్పాట్లు

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జిల్లా అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా విధులు నిర్వర్తించాలని సిబ్బందిని ఆదేశించారు.

బడికి వేళాయే..



వేసవి సెలవుల్లో ఆటపాటలతో గడిపిన చిన్నారులు నేటి నుంచి ఇక బడిబాట పట్టనున్నారు. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటు బుక్‌లు, టై, షూ, బెల్టు తదితర వస్తువులను కొనుగోలు చేసే పనిలో తల్లిదండ్రులు బిజీబిజీగా మారారు. ఇన్ని రోజులు బోసిపోయిన పాఠశాలలు మామిడి తోరణాలతో స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యాయి. పుస్తకాలతో మళ్లీ కుస్తీ పడేందుకు విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారు.



పునఃప్రారంభానికి సిద్ధంగా యాదమరి మండలం పెరుమాళ్లపెంట ప్రాథమిక పాఠశాల

- నేటి నుంచి స్కూళ్ల పునఃప్రారంభం
- మామిడి తోరణాలతో స్వాగతం పలకనున్న సర్కారు స్కూళ్లు
- బడిబాట పట్టనున్న విద్యార్థులు
- పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధం
- తొలిరోజే విద్యాసామగ్రి అందజేయాలని అధికారుల ఆదేశాలు

చిత్తూరు కలెక్టరేట్ : విజ్ఞానం విద్యతోనే సాధ్యం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యారంగానికి ఉన్న ప్రాధాన్యత మరోదానికి లేదు. కుటుంబపరంగా, సమాజపరంగా ఎన్నిరకాల ఇబ్బందులు ఎదురైనా తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్‌ను ఇవ్వాలనే తాపత్రయపడతారు. పేదరికాన్ని సైతం ఎదురొడ్డి చదివించేందుకు ఆరుగాలం కష్టపడతారు. అయితే వేసవి సెలవులు ముగియడంతో పిల్లలను స్కూల్‌కు పంపేందుకు తల్లిదండ్రులు ఇప్పటికే సిద్ధమయ్యారు. విద్యార్థులను బడికి పంపడంలో తల్లిదండ్రులపై ఉన్న గురుతర బాధ్యతను తెలియజేస్తోంది.

శుభ్రంగా స్కూళ్లు..

విద్యార్థులు వేసవి సెలవుల సంబరాల్లో నిమగ్నమయ్యారు. పుస్తకాలు, బ్యాగులను మూలన పడేశారు. సెలవుల్లో వాటిని చాలామంది తెరవలేదు. బంధుమిత్రుల ఇళ్లు, విహారయాత్రలు, శుభకార్యాలకు వెళ్లడం వల్ల సెలవులను ఆస్వాదించారు. కొత్త పుస్తకాలతో స్కూళ్లకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు.

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పరిధిలోని ఏడు యాజమాన్యాలకు సంబంధించి ప్రాథమిక స్కూళ్లు 1,931, ప్రాథమికోన్నత స్కూళ్లు 181, ఉన్నత పాఠశాలలు 354 ఉన్నాయి. ఇందులో 1,54,191 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 8,728 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ యాజమాన్యాలకు సంబంధించి 408 పాఠశాలలు ఉండగా అందులో 79,734 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొదటిరోజు స్కూళ్లను పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.

జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల సమాచారం

- జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు 2,089
- ప్రాథమికోన్నత పాఠశాలలు 261
- ఉన్నత పాఠశాలలు 524
- మొత్తం పాఠశాలలు 2,874
- ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు 20,870
- 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు 86,492
- 6, 7 తరగతుల విద్యార్థులు 23,976
- 6-10 తరగతుల విద్యార్థులు 1,23,457
- మొత్తం విద్యార్థులు 2,33,925

ఒక్కప్పుడు యూనిఫాం అంటే..

ఒక్కప్పుడు యూనిఫాం అంటే ప్రైవేట్ స్కూళ్లకే అన్న భావన ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా సర్కారు స్కూళ్లలోని విద్యార్థులకు యూనిఫాం ఇచ్చేందుకు కోట్ల రూపాయలను వెచ్చించింది. పైగా తొలిరోజే విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేసింది. ఇప్పుడు కొత్తప్రభుత్వం ఏర్పాటైంది. అదే ఒరవడిని కొనసాగిస్తారని తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

పండుగ వాతావరణంలో ప్రారంభం..



స్కూళ్లను పండుగ వాతావరణంలో పునఃప్రారంభించాలని ఆదేశించాం. పాఠశాలలను మామిడి తోరణాలతో అలంకరించి విద్యార్థులకు స్వాగతం పలకాలి. విద్యార్థులకు సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని విద్యాశాఖను ఆదేశించాం. సర్కారు స్కూళ్లకు ప్రభుత్వం అందజేసే విద్యాసామగ్రిని పకడ్బందీగా విద్యార్థులకు అందజేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. గతేడాది కంటే ఈసారి విద్యార్థుల సంఖ్యను పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించాం.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

సర్కారు స్కూళ్లలో చేర్పించండి..



తల్లిదండ్రులు విద్యార్థులను సర్కారు స్కూళ్లలో చేర్పించాలి. ప్రభుత్వ బడుల్లోనే అన్ని మౌలిక వసతులు, నాణ్యమైన విద్య అందించడం జరుగుతుంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను కల్పించాం. పాఠ్యపుస్తకాలు, ఇతర విద్యాసామగ్రి రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సరఫరా చేయడం జరుగుతుంది. విద్యార్థులను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడతాం.

– దేవరాజు, డీఈఓ, చిత్తూరు జిల్లా

ఎలాంటి సమస్యలు లేకుండా..



విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించాం. గురువారం నుంచి స్కూళ్లు పునఃప్రారంభం కానున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ సరఫరా చేసిన విద్యాసామగ్రిని అన్ని మండలాలకు, పాఠశాలలకు పంపిణీ చేసే కసరత్తును పకడ్బందీగా చేపడుతున్నాం. ప్రభుత్వం అందజేసే విద్యాసామగ్రిని సర్కారు స్కూళ్లలోని ప్రతి విద్యార్థికి అందించేలా చర్యలు చేపడుతున్నాం.

– పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, సమగ్రశిక్ష శాఖ, ఏపీసీ, చిత్తూరు జిల్లా

14 ఏళ్లలోపు పిల్లలు బడిలో ఉండాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న శిక్షణ సహాయ కలెక్టర్ హిమవంశీ

- పిల్లలను పనిలో పెట్టుకుంటే 1098కు ఫిర్యాదు చేయండి
- శిక్షణ సహాయ కలెక్టర్ హిమవంశీ

చిత్తూరు కార్పొరేషన్: బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకరించాలని శిక్షణ సహాయ కలెక్టర్ హిమవంశీ తెలిపారు. బుధవారం స్థానిక గాంధీసర్కిల్‌లో అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవ ర్యాలీని ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాలీలతో బాలకార్మికుల నిర్మూలన జరగదన్నారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే 1098కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. 14 ఏళ్లలోపు పిల్లలు పనుల్లో ఉంటే గుర్తించి స్కూళ్లలో చేర్పించాలని సూచించారు. జిల్లా కార్మికశాఖాధికారి ఓంకార్‌రావు మాట్లాడుతూ కలెక్టర్, రాష్ట్ర కార్మికశాఖ ఆదేశాల మేరకు బాలకార్మికుల గుర్తింపు కోసం ఈనెల స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం అవగాహన ర్యాలీని చర్చివీధి, పొనియమ్మన్ గుడివీధి, పాతబస్టాండు మీదుగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎల్‌ఓ జగదీష్ బాబు, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ నాగమణి, పిల్లల సంరక్షణ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని 21 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 76,665 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,377 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.58 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

వసతి గృహాల్లో వసతులు కల్పించండి



మాట్లాడుతున్న డీడీ రాజ్యలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకూడదని ఆ శాఖ డీడీ రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడారు. వేసవి సెలవుల అనంతరం ఈ నెల 13న వసతి గృహాలు పునఃప్రారంభం కానున్నాయని తెలిపారు. వసతి గృహాల్లో ఉండే బాల, బాలికలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వార్డెన్లు చర్యలు చేపట్టాలన్నారు. వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగు పరచాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, హాస్టళ్లలో గదులు పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. వార్డెన్లు స్థానికంగా ఉంటూ విధులు సక్రమంగా నిర్వర్తించాలని, అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని ఆమె హెచ్చరించారు.

పరిశుభ్రంగా ఉంచండి..

జిల్లావ్యాప్తంగా బీసీ సంక్షేమ వసతి గృహాల్లో నూతన అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి వహించాలని ఆ శాఖ డీడీ రబ్బానీబాషా తెలిపారు. బుధవారం ఆయన క్షేత్రస్థాయి వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి బీసీ వసతి గృహాలను పరిశుభ్ర వాతావరణంలో పునఃప్రారంభించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రాంగణాలు, గదులు, మరుగుదొడ్లు, స్నానపుగదులు, తాగునీటి ట్యాంకులతో పాటు వినియోగ ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలన్నారు. అన్ని వసతి గృహాల్లో వందశాతం బయోమెట్రిక్ హాజరు నమోదు కావాలని తెలిపారు.

శ్రీవారి సేవలో సోధే వాదిరాజా మఠం పీఠాధిపతి



శ్రీవారి ఆలయం వద్ద పీఠాధిపతి విశ్వ వల్లభ తీర్థ స్వామి, కన్నడ సినీ నటులు రక్షిత్ శెట్టి, రాజ్ బి శెట్టి

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం ఉడిపిలోని సోధే వాదిరాజా మఠం పీఠాధిపతి విశ్వ వల్లభ తీర్థ స్వామి సేవించుకున్నారు. బేడి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆయనకు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. పీఠాధిపతితోపాటు కన్నడ సినీ నటులు రక్షిత్ శెట్టి, రాజ్ బి శెట్టి శ్రీవారి దర్శించుకున్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు మెరుగైన శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఎన్‌సీసీ కేడెట్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్‌సీసీ కేడెట్లకు మెరుగైన శిక్షణ ఇస్తున్నట్లు క్యాంప్ మేజర్ లోకనాథం అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ శిక్షణా శిబిరంలో ఎన్‌సీసీ కంబైన్డ్ ఎన్యూవల్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా సైనిక్, ఐజీసీ ఆర్‌డీసీ క్యాంప్ ఎంపికలకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందే కేడెట్లకు మెరుగైన ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రతి కేడెట్ శిక్షణలో రాణించేలా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతోందని తెలిపారు. అనంతరం చిత్తూరు, కడప, తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల నుంచి పాల్గొన్న కేడెట్లకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, రమేష్, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మొగిలి ఘాట్‌లో కారు బోల్తా


మృతి చెందిన గర్భిణి జయశ్రీ

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్ సమీపంలోని దొరచెరువు వద్ద బుధవారం కారు అదుపు తప్పి బోల్తా పడడంతో నాలుగు నెలల గర్భిణి మృతి చెందగా, భర్త, తల్లికి స్వల్పంగా గాయపడిన సంఘటన వెలుగు చూసింది. సీఐ లక్ష్మయ్య తెలిపిన వివరాలు మేరకు.. బెంగళూరుకు చెందిన ప్రతాప్(39), అత్త లక్ష్మి(53)తో కలిసి గర్భిణి అయిన అతని భార్య జయశ్రీ(32)ని తీసుకుని వేలూరు సీఎంసీలో వైద్య పరీక్షల కోసం ఉదయం 5.30 గంటలకు కారు(ఏపీ30క్యూఏ4069)లో బయలుదేరారు. మార్గమధ్యలో మొగిలి ఘాట్ సమీపంలో గల దొరచెరువు వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన రైలింగ్‌ను కారు అదుపు తప్పి ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో జయశ్రీ తీవ్రంగా గాయపడగా, ప్రతాప్, లక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రథమ చికిత్స కోసం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ జయశ్రీ మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మయ్య తెలిపారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మతుకువారిపల్లె, చల్లావారిపల్లెల్లో బుధవారం తెల్లవారుజామున పంట పొలాలపై ఏనుగులు దాడి చేసి పంట నష్టం చేశాయి. ముఖ్యంగా మామిడి తోటల్లో ప్రవేశించి కొమ్మలు విరిచేసి నష్టం కలిగించాయి. అలాగే అరటి, కూరగాయల పంటలను కూడా తొక్కేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అటవీశాఖ సిబ్బంది వచ్చి పంట నష్టాన్ని పరిశీలించారు. చేతికొచ్చిన పంటలను ఇలా ఏనుగులు ధ్వంసం చేయడంతో భారీగా నష్టపోవాల్సి వస్తోందని బాధిత రైతులు వాపోయారు. ఏనుగుల దాడిని సంబంధిత అధికారులు నియంత్రించాలని కోరారు.


శాంతిపురం మండలంలో డయేరియా కేసుల గురించి ఆరా తీస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు(ఫైల్)


పుత్తూరులో బాధితుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

అతిసారం.. వద్దు నిర్లక్ష్యం

- తాగునీటి కలుషితం వల్లే వ్యాధి వ్యాప్తి
- చేతుల శుభ్రత, పరిసరాల శుభ్రత తప్పనిసరి అంటున్న వైద్యులు
- వర్షాలకు మరిన్ని కేసులు నమోదవుతున్న వైనం
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు అంటున్న వైద్యాధికారులు
- ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచన

కాణిపాకం: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 108 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటి పరిధిలో గత రెండు నెలలుగా 80పైగా కేసులు నమోదయ్యాయి. వర్షాల కారణంగానే ప్రజలు పలుచోట్ల అతిసారం బారిన పడుతున్నారు. ప్రధానంగా తాగునీరు కలుషితం కావడం వల్లే డయేరియా వ్యాపిస్తోంది. ఇక అపరిశుభ్రత కారణంగా ఆయా ప్రాంతాల్లో డయేరియా వ్యాపించినట్లు అధికారులు చెబుతున్నారు. డయేరియా కేసులు నమోదైతే అధికారులు తక్షణ చర్యలు చేపడుతున్నారు. గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యసేవలు అందించి ప్రజలకు భరోసా ఇస్తున్నారు. తద్వారా డయేరియా వ్యాప్తి కట్టడికి కృషి చేస్తున్నారు.

వ్యాధి వ్యాప్తికి కారణాలు ఇలా..

విరోచనాలు నీళ్లనీళ్లగా, పలుచగా అవుతుంటే డయేరియా అని అర్థం. వైద్య పరిభాషలో దీన్ని గ్యాస్ట్రో ఎంటిరైటిస్‌గా పిలుస్తారు. ఈ వ్యాధి జీర్ణవ్యవస్థకు సోకుతుంది. నీళ్ల విరోచనాలు నూటికి 70 శాతం వైరస్ క్రిముల వల్ల వస్తాయి. కలుషితమైన నీటిని తాగడం వల్ల, మలం మీద వాలిన ఈగలు ఆహార పదార్థాలపై వాలితే, ఆ ఆహారం తినడం ద్వారా వివిధ రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి విరేచనాలు అవుతాయి.

వ్యాధి లక్షణాలు..

జీర్ణవ్యవస్థ పనితీరు అస్తవ్యస్తంగా ఉడి వాంతులు, విరోచనాలు అవుతాయి. విరోచనాలు పలుచగా కావడం, కడుపులో మెలి పెట్టినట్లు నొప్పి ఉంటుంది. నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కలు నొప్పులు వస్తాయి. మనం తాగేనీరు శరీరం నుంచి అధిక మొత్తంలో బయటకు వెళ్లిపోతే డీహైడ్రేషన్ ఏర్పడి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. డీహైడ్రేషన్‌లో నాడి వేగంగా లేదా బలహీనంగా కొట్టుకోవడం లేదా ఒక్కోసారి అసలు నాడి తెలియకపోవడం జరుగుతుంది. నీరసం, నోరు, నాలుక, పిడచకట్టుకుపోవడం, శరీరం ఎండిపోవడం, ఒక్కోసారి మూత్రం అసలు రాకపోవడం లేదా చాలా తక్కువగా రావడం, ముదురు పసుపు రంగులో మూత్రం రావడం జరుగుతుంది. వయసుతో సంబంధం లేకుండా డీహైడ్రేషన్ వస్తుంది. దీనివల్ల పిల్లలకు, వృద్ధులకు ఎక్కువ ప్రమాదం.

నివారణ ఇలా..

- చేతుల శుభ్రత పాటించాలి
- పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి
- బయట ప్రాంతాల్లో ఆహారం తినడం మంచిది కాదు
- ఉడకని మాసం తినకూడదు
- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నిర్లక్ష్యం వద్దు..



అతిసార లక్షణాలు బయటపడితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. అతిగా వాంతులు, విరేచనాలు జరిగితే ప్రమాదకరం. ఈ విషయంలో నిర్లక్ష్యం వద్దు. పిల్లలు, వృద్ధుల విషయంలో మరింత జాగ్రత్త అవసరం. ముఖ్యంగా చేతుల శుభ్రత పాటించాలి. పరిసరాలు శుభ్రంగా ఉండాలి. వర్షాకాలంలో తాగునీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలి. జిల్లాలో ఎక్కడైనా కేసులు నమోదైతే కట్టడికి చర్యలు తీసుకుంటాం. అధికారులను అప్రమత్తం చేస్తున్నాం. – ప్రభావతిదేవి, జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి, చిత్తూరు జిల్లా

సొంత వైద్యం వద్దు..



డయేరియాతో ఏం కాదులే అనే నిర్లక్ష్యం వద్దు. ఆ అనుమానం ఉంటే వెంటనే వైద్యుల దగ్గరికి వెళ్లి పరీక్షించుకోవాలి. కలుషిత ఆహారం, తాగునీరు, శుభ్రత లేని కారణంగానే ఈ కేసులు వస్తుంటాయి. ప్రధానంగా ఈ మూడింటిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి. వర్షాకాలం వస్తే తాగునీటిని కాచి చల్లార్చి తాగడం ఉత్తమం. సొంతవైద్యం వద్దు. వైద్యుల సూచనలను పాటించాలి.
– శ్రీహరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, తిరుపతి జిల్లా

తిరుపతి జిల్లా పుత్తూరు మండలంలో ఐదు రోజుల క్రితం డయేరియా కేసులు బయటపడ్డాయి. తీవ్ర అతిసారం కావడంతో పలువురు మంచానపడ్డారు. ఈవిషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది వెంటనే వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సమాచారం అందించారు. తక్షణమే అధికారులు క్యాంపు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించారు. 24 మందికి అతిసారం ఉన్నట్లు నిర్ధారించి నగరి, పుత్తూరు, రుయా ఆస్పత్రులకు తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. కాగా ఓ బాలిక మృతి చెందిందని..ఈ బాలిక మృతికి అతిసారంతో పాటు పలు అనారోగ్య సమస్యలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. తాగునీటి కలుషితం కారణంగానే అతిసారం వ్యాపించిందని అంటున్నారు.

- గత నెల చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం నడింపల్లిలో 20 మందికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి వెంటనే అక్కడ క్యాంపు ఏర్పాటు చేశారు. అనుమానిత వ్యక్తులకు పరీక్షలు చేసి వైద్యసేవలు అందించారు. అలాగే పారిశుద్ధ్యం పనులు కూడా చేపట్టారు. తాగునీటి శ్యాంపిల్స్ సేకరించారు. బాధితులను అధికారులు నిరంతరం పర్యవేక్షణలో ఉంచి, ఎవరికీ ఎలాంటి హాని కలగకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టారు. అలాగే ఎస్‌ఆర్ పురం మండలం తిరుమలయ్యగారిపల్లిలో కూడా అపరిశుభ్రత, కలుషిత ఆహారం తిని 20 మందిపైన డయేరియాతో బాధపడ్డారు. అధికారులు చర్యలు చేపట్టడంతో ఆరోగ్యంగా ఉన్నారు.
- వర్షాకాలం, వేసవి కాలాల్లో వచ్చే వ్యాధుల్లో అతిసారవ్యాధి (డయేరియా) ముఖ్యమైంది. ఈ వ్యాధికి సకాలంలో వైద్యం అందించని పక్షంలో ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఏటా వేసవిలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అతిసార వ్యాధి కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. వ్యాధి రాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

రేపు ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి సిటీ:ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ కంపెనీ ఆధ్వర్యంలో జరిగే జాబ్ మేళాలో ఫార్మసీ ఎయిడ్, రీటైల్ ట్రైనీ అసిస్టెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీతో పాటు డీఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ చేసిన యువత అర్హులని తెలిపారు. వివరాలకు 95338 89902, 7989810194 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

16న జాతీయ శతాధిక కవి సమ్మేళనం


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పద్మనాభం

తిరుపతి కల్చరల్ : ఎస్వీయూలో ఈ నెల 16వ తేదీన జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపల్ జి.పద్మనాభం తెలిపారు. బుధవారం ఈ మేరకు ఎస్వీయూ డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అండ్ కల్చర్ అఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీధర్‌తో కలిసి సమ్మేళనం బ్రోచర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీకళా వేదిక రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ధనాసి ఉషారాణి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తి బండ ప్రతాప్, కన్వీనర్ కొల్లా రమావతి, ఈశ్వరీ భూషణం, హరిసర్వోత్తమ నాయుడు, చిట్టి లలిత, పార్థసారథి, సంపత్‌కుమార్, గుండాల రాకేష్, కవులు సుధాకర్, నిర్మల, అవధాని మేడసాని మోహన్, సమాజ సేవకురాలు స్పెషల్ బ్రాంచ్ సుమతి, వీసీ కుసుమకుమారి, భూమన హాజరవుతారని తెలిపారు.

'బాబు' ప్రమాణ స్వీకార ప్రసారంలో యంత్రాంగం


చిత్తూరులో చంద్రబాబు ప్రమాణ స్వీకార ప్రసారాన్ని తిలకిస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు, ప్రజలు

చిత్తూరు అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా బుధవారం ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. నియోజకవర్గ కేంద్రాల్లో టీవీల ద్వారా.. గన్నవరంలోని కేసరపల్లె ఐటీ పార్కులో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రజలు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. చిత్తూరు నగరంలో గాంధీ విగ్రహ కూడలి, నాగయ్య కళాక్షేత్రంలో ప్రత్యక్ష ప్రసారాలను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. వెండితెర, ఎల్ఈడీల్లో కూటమి ప్రభుత్వం తరపున సీఎంగా బాబు, మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్, జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డ్వామా పీడీ రాజశేఖర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, డీఆర్‌డీఏ పీడీ తులసి, మెప్మా అర్బన్ పీడీ రాధమ్మతో పాటు టీడీపీ నేతలు కోదండ యాదవ్, సుబ్రమణ్యం, సురేంద్రకుమార్, మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై వరదరాజుల స్వామి



హనుమంత వాహనంపై విహరిస్తున్న స్వామివారు

యాదమరి (పూతలపట్టు): ప్రసిద్ధ శ్రీవరదరాజుల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం హనుమంత వాహనంపై స్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం మూలస్థానంలో స్వామివారికి విశేష పూజలు, అలంకరణలో దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం ఏడు గంటలకు మూలవర్లకు పుష్పకైంకర్యం, సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహించారు. సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో అలంకరించి హనుమంత వాహనంపై అధిష్టంపజేసి పూజలు చేశారు. అనంతరం మేళతాళాలతో నడుమ పురవీధుల ఊరేగింపు కనువిందు చేసింది. భక్తుల అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు.

నేడు రథోత్సవం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారికి విశేష పూజలు జరుగుతాయి. అనంతరం మూడు గంటలకు రథోత్సవం ద్వారా స్వామివారు పురవీధుల్లో విహరిస్తారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఆగని దాడులు


టీడీపీ నేతల దాడిలో గాయపడిన లక్ష్మీనారాయణ

- వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడి చేస్తున్న టీడీపీ నేతలు
- గ్రామీణ ప్రాంతాల్లో భయానక వాతావరణం
- కఠిన చర్యలు తీసుకోవాలంటున్న బాధితులు

మంగళం : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు నుంచి చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ నేతలు అల్లర్లకు పాల్పడుతున్నారు. కౌంటింగ్ తర్వాత మరింతగా పేట్రేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై వరుస దాడులకు దిగుతున్నారు. టీడీపీ శ్రేణుల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఒంటరిగా బయటకు రావడానికి ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయి కర్రలు, ఇనుప చువ్వలతో దాడి చేస్తుండడంపై ప్రజల్లో సైతం ఆందోళన వ్యక్తమవుతోంది. దాడి చేసిన వారిని పోలీసులు అరెస్ట్ చేయకుండా వదిలేస్తుండడం వల్లే గొడవలు కొనసాగుతున్నట్లు స్థానికులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. బుధవారం తాజాగా తిరుపతి రూరల్ మండలం రణధీరపురం పంచాయతీ సర్పంచ్ లీలావతి భర్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పట్టపగలు అందరూ చూస్తుండగానే కర్రలతో విచక్షణారహితంగా చితకబాదారు. దీంతో ఆ ప్రాంతంలో ప్రజలు భయంతో పరుగులు తీశారు.

కారును ధ్వంసం చేసినవారే..

రెండు రోజుల క్రితం సప్తగిరి కాలనీ పంచాయతీ ఉప సర్పంచ్ అశోక్ రెడ్డి కారును ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్తలే తనపై దాడి చేసినట్లుగా బాధితుడు వివరించారు. అసలు ఎందుకు కొడుతున్నారో కూడా తెలియకుండా కర్రలతో చచ్చేలా కొట్టారని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెవిరెడ్డి పరామర్శ



లక్ష్మీనారాయణను పరామర్శిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మీనారాయణపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెంటనే స్పందించారు. బాధితుడిని చికిత్స నిమిత్తం చేర్చిన రుయా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. లక్ష్మీనారాయణకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. దాడికి పాల్పడిన నిందితులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు విన్నవించారు. బాధితుడికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మంగళం ఔట్‌పోస్టులో ఫిర్యాదు

టీడీపీ నేతల అరాచకాలను అడ్డుకోవాలని, వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులను అరికట్టాలని బాధితుడు లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు మంగళం పోలీస్ ఔట్‌పోస్టులో ఎస్ఐ జగన్నాథంకు ఫిర్యాదు చేశారు. తిరుపతి నుంచి ఇంటికి వెళుతుంటే మంగళం సర్కిల్ వద్ద టీడీపీ నాయకులు తనను అడ్డగించి అమానుషంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని పేర్కొన్నారు. ఇలాంటి దాడులు మళ్లీ పునరావృతం కాకుండా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ, డివిజన్ అధ్యక్షుడు ప్రళయకావేరి నారాయణరెడ్డి, తిరుమలనగర్, సప్తగిరినగర్ పంచాయతీల ఇన్‌చార్జిలు గుండ్రాజు శివశంకర్‌రాజు, అశోక్‌రెడ్డి, ఉపసర్పంచ్‌లు మల్లెమొగ్గల ఉమాపతి, బైరెడ్డి రమేష్, పంచాయతీ అధ్యక్షుడు రజాక్, వార్డు సభ్యుడు దయాకర్ ఉన్నారు.

నిండు కుండలా పులికాట్


పులికాట్‌లో పక్షుల సందడి

సూళ్లూరుపేట : పులికాట్ సరస్సు నిండు కుండను తలపిస్తోంది. నిన్న మొన్నటి వరకు సరస్సు ఎండిపోయి ఉప్పుతో కప్పబడి శ్వేత వర్ణపు ఎడారిలా మారిపోయింది. దీంతో పులికాట్ సమీప గ్రామాల ప్రజలు ఉప్పు సేకరించుకుని విక్రయాలు సాగించారు. నిన్న మొన్నటి వరకు ఇదే పరిస్థితి ఉంది. అయితే ఇప్పుడు ఒక్కసారిగా సరస్సులోకి భారీగా నీరు చేరింది. చెదురు మదురుగా వర్షాలు కురుస్తున్నప్పటికీ అవి పులికాట్ సరస్సు దాకా చేరే అవకాశం లేదు. అయితే హఠాత్తుగా నీరు ఎలా చేరిందని పలువురి మదిలో ప్రశ్నలు తలెత్తాయి. నైరుతి రుతుపవనాల ప్రభావంతో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి వల్ల ఆటుపోట్లు ఏర్పడి సముద్రం నుంచి సరస్సులోకి ఉప్పునీరు విపరీతంగా చేరిందని నిపుణులు వెల్లడిస్తున్నారు. పులికాట్ సరస్సుకు, బంగాళాఖాతానికి ఉన్న అవినాభావ సంబంధం వల్ల తరచుగా ఇలా జరుగుతూ ఉండడం కూడా సహజమేనని చెబుతున్నారు. సముద్రం నుంచి ఉప్పునీటితో పాటు మత్స్య సంపద కూడా తరలిరావడంతో సంప్రదాయ మత్స్యకారులు, విసురుడు వలలతో చేపలు పట్టుకునే తీరప్రాంత గిరిజన జాలర్లకు చేతినిండా పని దొరికింది. పులికాట్‌లో నీరు చేరడమే తరువాయి ఎవరో పిలిచినట్టుగా అప్పుడే కొన్ని రకాల విదేశీ, స్వదేశీ విహంగాలు ఆహారవేటలో పడ్డాయి. ఫ్లెమింగోలు కూడా అక్కడక్కడా గుంపులు గుంపులుగా చేరి దర్శనమిస్తున్నాయి.

